క్లుప్తంగా

పూతదశలో బెండ సాగు



కె.సంతపాలెంలో బెండ పంట

కె.కోటపాడు: ప్రస్తుతం బెండ సాగు పూతదశకు చేరుకుంది. ప్రధానంగా కొరువాడ, గవరపాలెం, కింతాడ, గొల్లలపాలెం, పాతవలస, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, సింగన్నదొరపాలెం, కొత్త అగ్రహారం గ్రామాల్లోని 150 ఎకరాల్లో ఈ పంట పండిస్తున్నారు. నీటి వసతి కలిగిన పొలాల్లో బెండ సాగు చేస్తున్నారు. పంట ఆశాజనకంగా ఉండడంతో మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



గురుకుల కళాశాలలో రాత పరీక్షకు హాజరైన విద్యార్థులు

గొలుగొండ: ఏపీ గురుకుల కళాశాలలో ఐదో తరగతి ప్రవేశానికి స్థానిక గురుకుల కళాశాలలో ఆదివారం రాత పరీక్ష నిర్వహించారు. సుమారుగా 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాత పరీక్షలో మంచి మార్కులు వచ్చిన వారికి మాత్రమే సీట్లు కేటాయిస్తామని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఈ పరీక్షకు పర్యవేక్షకుడిగా కోటేశ్వరరావు వ్యవహరించారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాత

దేవరాపల్లి: ఎం. అలమండలో గొర్లె పార్వతమ్మ జ్ఞాపకార్థం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఇక్కడ చర్చిలోని జీఎస్‌ఆర్ ట్రస్టు చైర్మన్ గొర్లె శ్రీనివాసరావు సతీమణి విజయలక్ష్మి సోమవారం పేదలకు, బంధువులకు, స్నేహితులకు సైతం వీటిని అందజేశారు. చర్చి పాస్టర్‌కు నూతన దుస్తులతోపాటు నగదు సాయం చేశారు.

పెదనందిపల్లిలో పశు వైద్య శిబిరం నేడు

దేవరాపల్లి: పెదనందిపల్లిలో పశు వైద్య ప్రత్యేక శిబిరాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు మామిడిపల్లి, ఎం. అలమండ పశువైద్యాధికారులు జి. ప్రియాంక, కె.మంజుషా రాణి ఆదివారం తెలిపారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఏపీ పశు సంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభిస్తారన్నారు. పశువుల్లో అన్ని వ్యాధులకు వైద్య పరీక్షలతోపాటు శస్త్రచికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తామన్నారు. పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి ప్రసాద్, కె.కోటపాడు పశువైద్యాధికారి బైరాగి హాజరవుతారన్నారు.

పాలిటెక్నిక్ శిక్షణకు స్పందన

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్, ఏపీజేఆర్జేసీ ఉచిత కోచింగ్‌కు విశేష స్పందన లభిస్తోంది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సహాయ సహకారాలతో ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, మండలాధ్యక్షుడు కొరుపోలు శ్రీను ఆధ్వర్యంలో కోచింగ్ నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనుభజ్ఞులైన ఉపాధ్యాయులతో రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ అందిస్తున్నారు. ఉదయం చెప్పిన సిలబస్‌పై సాయంత్రం పరీక్షలను సైతం నిర్వహిస్తున్నారు. ఈ కోచింగ్ సంబంధించిన విలువైన స్టడీ మెటీరియల్‌ను విజయవాడను తెప్పిస్తున్నామని, త్వరలోనే విద్యార్థులకు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

'కేంద్రం తీరు మార్చుకోవాలి'

రాంబిల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం మండల కార్యదర్శి జి. దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నేవీ పునరావాసకాలనీ, యాత కొత్తపట్నం గ్రామాల్లో ప్రచారభేరి నిర్వహించారు.

ప్రగతి పథంలో మాడుగుల

- రూపురేఖలు మారుతున్న పట్టణం
- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- డిప్యూటీ సీఎం బూడి ప్రత్యేక దృష్టి



మాడుగుల ప్రధాన రహదారికి అనుసంధానంగా వేసిన డబుల్ సీసీ రోడ్డు



ప్రారంభానికి సిద్ధంగా అగ్రి ల్యాబ్

మాడుగుల: ఒకప్పుడు మహరాజులు ఏలిన నేల అది.. రత్నాలు, వైడూర్యాలతో తులతూగేది. ఆనాటి పాలనా వైభవానికి సాక్ష్యంగా నిలిచిన కోట నేటికీ దర్శనమిస్తోంది. ఈ నేపథ్యంలో గత పాలకుల ఉదాసీన వైఖరితో క్రమంగా ప్రాభవం కోల్పోయిన మాడుగుల పట్టణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో జీవం పోసినట్లయింది. కోట్లాది రూపాయల అభివృద్ధి పనులతో ప్రగతి పథంలో దూసుకుపోతోంది.

నియోజకవర్గం- మాడుగుల

మండల కేంద్రం	- మాడుగుల
మాడుగుల జనాభా	- 20 వేల పైమాటే
ఓటర్లు	- 12 వేలు
వార్డులు	- 16
సచివాలయాలు	-3
రైతు భరోసా కేంద్రాలు	-3



హైస్కూల్ కాలనీలో సీసీ డ్రైనేజీలు

మాడుగుల పట్టణంలో అభివృద్ధి పనులు మచ్చుకు కొన్ని...

- మోదమాంబ కాలనీలో రూ.70 లక్షలతో సీసీ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి.
- హైస్కూల్ కాలనీలో రూ 1.3 కోట్లతో 21 సీసీ రోడ్లు కమ్ డ్రైనేజీ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి.
- గవర వీధిలో రూ.20 లక్షలతో డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి.
- రూ.55 లక్షలతో కొత్తగా ప్రభుత్వాస్పత్రి పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి.
- జగ్గన్న సావిడి పరిధి 10, 11వ వార్డుల్లో రూ.20 లక్షలతో సీసీడ్రైనేజీలు పూర్తయ్యాయి.
- మోదమాంబ కాలనీలో రూ.1.3 కోట్లతో డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి.
- మాడుగుల పట్టణంలో ప్రధాన రహదారికి అనుసంధానంగా రూ.65 లక్షలతో డబుల్ సీసీ రోడ్డు నిర్మించారు.
- మోదమాంబ కాలనీలో రూ.35 లక్షలతో కల్యాణ మండపం నిర్మిస్తున్నారు.
- పట్టణంలో ఇంటింటికీ కుళాయి పనులకు రూ.6.50 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.
- రైతులు అనకాపల్లి వెళ్లకుండా ఇక్కడే భూసార పరీక్షలు చేయించుకోవడానికి వీలుగా రూ.60 లక్షలతో అగ్రి ల్యాబ్ నిర్మాణం
- రూ.1.20 కోట్లతో మూడు గ్రామ సచివాలయాల భవనాలు నిర్మించారు.
- రూ.21 లక్షలతో ఒక రైతు భరోసా కేంద్రం భవనం నిర్మించారు. మరో రూ.42 లక్షలతో రెండు రైతు భరోసా కేంద్రాలకు భవన నిర్మాణ పనులు చేస్తున్నారు.
- రూ.50 లక్షలతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మిస్తున్నారు. అవసరమైతే మరో రూ.40 లక్షలు మంజూరుకు డిప్యూటీ సీఎం సిద్ధంగా ఉన్నారు.

28 ఏళ్ల కల ఫలించింది



నేను ఇల్లు నిర్మించుకుని 28 ఏళ్లయింది. అప్పటి నుంచి వర్షం కురిస్తే మురుగు ఇంటిలోకి చేరిపోయేది. పల్లపు ప్రాంతం కావడంతో కొండ గెడ్డల నీరు చేరడంతో రాత్రిళ్లు కంటిమీద కునుకు లేకుండా పోయేది. ఈ సమస్య పరిష్కారానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో 21 సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. ఇప్పుడు చాలా ఆనందంగా ఉంది.

– బండి రమణమ్మ, హైస్కూల్ కాలనీ, మాడుగుల

మాడుగుల అభివృద్ధి పరుగులు



మాడుగుల పట్టణంలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ప్రజల కష్టాలు ప్రత్యక్షంగా చూశారు. ఇక్కడ 50 ఏళ్లుగా సాధ్యం కాని అభివృద్ధిని మూడేళ్లలో కోట్లాది రూపాయలతో చేసి చూపించారు. రానున్న కాలంలో మోడల్ పట్టణంగా మారనుంది.

– మిత్తిపాటి అశోక్, గ్రామస్తుడు, మాడుగుల

మోడల్ పట్టణమే లక్ష్యం



రెండు దఫాలుగా నాకు అత్యంత మెజారిటీ ఇచ్చిన మాడుగుల పట్టణ ప్రజల రుణం తీర్చుకోలేనిది. నన్ను గెలిపించిన ఈ ప్రజల కోసం మాడుగులను మోడల్ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రస్తుతం అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాదిలోగా మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తా.

– బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం, మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే

ప్రజాదరణ చూడలేక టీడీపీ విమర్శలు



చుక్కపల్లిలో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం




ఎం. కోడూరులో ఇంటింటికి తిరుగుతున్న సర్పంచ్ సంజీవిరావు

ఆదరణ చూడలేకే టీడీపీ ఆరోపణలు

మాడుగుల రూరల్: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు తెలిపారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎం. కోడూరులో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ లబ్ధిని వివరించారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, చింతా వెంకటరమణమూర్తి, పడాల అప్పలనర్సయ్య, హైస్కూలు కమిటీ చైర్మన్ కోన అన్నపూర్ణ, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. డి.గొటివాడలో సర్పంచ్ గోకాడ అర్జునరావు సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ అల్లు రమణ, గోకాడ అప్పలనాయుడు, పార్టీ నాయకులు ఆదారి జగన్నాథరావు పాల్గొన్నారు.

మాకవరపాలెం: సంక్షేమ పథకాలు అమలుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూడలేకే టీడీపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ ధ్వజమెత్తారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా రామన్నపాలెంలో ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 40 ఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగేళ్లలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చేసి చూపించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్న విషయం అందరూ గమనించాలని పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ చిటికెల రమణ, సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ బొడ్డు గోవిందరావు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో నాయకుల జేబులు నిండేవని, ప్రస్తుత పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యేను విమర్శించేస్థాయి టీడీపీ నేతలకు లేదన్నారు. ఆయన సత్తా ఏంటో 2014 ఎమ్మెల్యే ఎన్నికల్లోనూ, శెట్టిపాలెం ఎంపీటీసీ ఎన్నికల్లోనూ చూపించిన విషయాన్ని మరొక్క సారి గుర్తు చేసుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ రాజారావు, సర్పంచ్ మాకిరెడ్డి అయ్యప్ప, యూత్ అధ్యక్షుడు శ్రీను, పార్టీ నాయకులు గొంతిన హరిబాబు, పెట్ల భద్రాచలం, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

చీడికాడ: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధి 23 పంచాయతీల్లో జగన్నే మా భవిష్యత్తు కార్యక్రమం దాదాపుగా చివరి దశకు చేరుకుంది. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం చుక్కపల్లిలో పార్టీ నేతలు బాయిశెట్టి వెంకటరమణ, మజ్జి దేవానంద్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింట తిరిగారు. వీరి వద్ద ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు సాగరంలో 'గడప గడపకు'

మాడుగుల: సాగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 6 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీపీ వేమవరపు రామధర్మజ(పెదబాబు) ఆదివారం తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరై ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు. నూతన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు హాజరు కావాలని కోరారు.

ఉత్తమ పంచాయతీలుగా ఎన్.కొత్తూరు, బుచ్చింపేట

రోలుగుంట: మండలం నుంచి ఎస్.కొత్తూరు, బుచ్చింపేట ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైనట్టు ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుచ్చింపేట సర్పంచ్ ఉలబాల చంద్ర, పంచాయతీ కార్యదర్శి మట్ట రాజశేఖర్, ఎస్.కొత్తూరు సర్పంచ్ పోతల రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అవార్డులు స్వీకరిస్తారన్నారు.

శోభాయాత్రకు కదిలిరండి..

కోటవురట్ల : మండలంలో వచ్చే నెల 14న నిర్వహించనున్న శ్రీ హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ ధర్మ ప్రచారక్ నక్కా సత్యనారాయణ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భారీ స్థాయిలో శ్రీ హనుమాన్ శోభాయాత్రను చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఇందు కోసం హిందూ బంధువుల సలహాలు, సహాయం తీసుకునేందుకు స్థానిక సినిమాహాలు రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో హనుమాన్ భక్తులు, మండల ప్రజలు, హిందూ ధర్మ ప్రచారకులు తరలివచ్చి తగు సూచనలు అందించాలని కోరారు.

నేడు గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం

- జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు
- 7 ఏళ్ల తర్వాత బంగారుమెట్ట, ఎల్.బి.పురంలో పండగ

బుచ్చెయ్యపేట: మండలంలోని బంగారుమెట్ట, ఎల్.బి. పురం గ్రామాల్లో గౌరీపరమేశ్వరుల అనుప మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. రెండు గ్రామాల ప్రజలు ఉమ్మడిగా ఐదేళ్లకోసారి పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 2016లో పండగ చేయగా, 2021లో కరోనా మహమ్మారితో నిర్వహించలేదు. మరలా ఏడేళ్ల తర్వాత రెండు గ్రామాల పెద్దలు ఉమ్మడిగా సోమవారం గౌరీపరమేశ్వరుల పండగను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. గతేడాది అక్టోబర్ 12న గౌరీపరమేశ్వరుల నిలుపు ఉత్సవాన్ని ప్రారంభించారు. ఆర్నెల్లుగా నిత్యం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఐదు రోజుల క్రితం అమ్మవారికి సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. తాజాగా అనుపోత్సవ కార్యక్రమం సందర్భంగా రెండు గ్రామాల మధ్యన రెండు కిలోమీటర్ల మేర మిరుమిట్లు గొలిపే భారీ విద్యుత్ లైటింగ్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. నేల వేషాలు ప్రతి వీధులోను బళ్ల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందెం నిర్వహించనున్నారు. మంత్రులు, ప్రభుత్వ విప్, ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు పలువురు నాయకులు, అధికారులు గౌరీపరమేశ్వరులను దర్శించుకోనున్నారు. రాత్రికి భారీ మందుగుండు సామగ్రి కాల్చివేత, డప్పులు, వాయిద్యాల నడుమ సంబరం ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.



గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలు



రెండు గ్రామాల మధ్యన ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్

పుస్తక పఠనంతో విజ్ఞానం



హాజరైన విద్యార్థులు



పాఠకులను ఉద్దేశించి మాట్లాడుతున్న గ్రంథపాలకురాలు దమయంతి

గొలుగొండ: స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథపాలకుడు రాజుబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. వేసవి సెలవుల్లో ఆటపాటలతో సమయం వృథా చేయకుండా గ్రంథాలయ సేవలు అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పుస్తక దినోత్సవం

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో అంతర్జాతీయ పుస్తక దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఇక్కడ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను విద్యార్థులు, పాఠకులు తిలకించారు. ఈ సందర్భంగా పుస్తకాల అవశ్యకతను గ్రంథాలయ అధికారి దమయంతి వివరించారు. విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధికి సహకరించిన దాతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే



నాగేశ్వరరావును అభినందిస్తున్న నాయకులు, ఎంఈవో, ఉపాధ్యాయులు



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

రోలుగుంట: హెచ్‌ఎం బండారు నాని ఆధ్వర్యంలో కొండపాలెం పంచాయతీ వెలంకాయలపాలెం ఎంపీపీ పాఠశాలలో శనివారం రాత్రి ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంఈవో సాయిశైలజ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఉత్సాహంతోపాటు స్వేచ్ఛాభావం ఏర్పడి మంచి అలోచనలకు పునాదులు వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలో చిన్నారులు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకునేలా కృషి చేస్తున్న వైఎస్సార్ యువజన నాయకుడు బెజవాడ నాగేశ్వరరావును అభినందించి శాలువాతో సత్కరించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన జోకర్ డ్యాన్సు, జానపద నృత్యాలు, మతిలేని డాక్టర్ మతి తప్పిన రోగుల నాటిక వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్యక్రమంలో పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డు శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, ఉపాధ్యక్షుడు బుడ్డిగ అప్పారావు, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉప సర్పంచ్ బంటు చిరంజీవి, మాజీ సర్పంచ్ బంటు సూర్య సన్యాసిదేముళ్లు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ భర్త మృతికి సంతాపం



వెంకటరమణ (ఫైల్)

నాతవరం: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కమిటీ సభ్యురాలు, నాతవరం జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స భర్త వెంకటరమణ (47) గుండెపోటుతో మరణించాడు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యకర్తలతో కలిసి స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులను కలిశారు. సాయంత్రం గ్రామంలో అందరితో సరదాగా గడిపిన ఆయన రాత్రి 9 గంటల సమయంలో తలనొప్పిగా ఉందంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఫోన్లో వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వైద్య సేవలు పూర్తిగా అందించకుండానే గుండెపోటుతో మరణించాడు. ఆదివారం ఉదయం నాతవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. వెంకటరమణ గతంలో పీఏసీఎస్ డైరెక్టరుగా పని చేశాడు. జెడ్పీటీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దొండా రాంబాబు, గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, నాతవరం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, స్థానిక సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు చెక్కా జోగిరాజు, మండలంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

మోదకొండమ్మ మాలధారణ ప్రారంభం

మాడుగుల రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, మాడుగుల గ్రామ దేవత మోదకొండమ్మ మాలధారణ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు పుల్లేటికుర్తి శ్రీనివాసరావు, 25 మంది భక్తులు అమ్మవారి మాలలు ధరించారు. వైశాఖ మాసం కావడంతో తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముప్ఫై ఏళ్ల క్రితం స్థానిక రిటైర్డు ఉద్యోగి గన్నంరాజు సుబ్బారావు ఈ మాలధారణ కార్యక్రమం ప్రారంభించారు. నాటి నుంచి ఏటా మాలధారణ భక్తులు సంఖ్య పెరుగుతోంది. 41 రోజుల పాటు నియమ నిష్ఠలతో దీక్ష చేసి ఆఖరి రోజు ఆలయంలో మాల విసర్జన చేస్తారని గురుమాతలు పల్లా సత్తిబాబు, గండి రామకృష్ణ, కోమనాపల్లి కొండబాబు తెలిపారు. అమ్మవారి పీఠంలో మాలధారణ భక్తులు రోజూ ఉదయం, సాయంత్రం, పూజాధి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తజనం

భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీలో స్వచ్ఛంద సంస్థలు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



క్యూలైన్లలో దర్శనానికి వెళ్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అనకాపల్లి జిల్లాతో పాటు పొరుగు జిల్లాలైన విజయనగరం, విశాఖ, పాడేరు, శ్రీకాకుళం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి హాజరుకావడంతో ఆలయంలో క్యూలైన్లు కిటకిటలాడాయి. పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు ఎక్కువగా హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువ పందిళ్లలో వంటలు చేసి అమ్మవారికి నివేదించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొంది, ఆనందంగా తిరుగుముఖంపట్టారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అధికారులు భక్తులకు మజ్జిగ, మంచినీరు అందించారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అవసరమైన సాయం చేశాయి. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పట్టణ సీఐ దాడి మోహన్‌రావు, ట్రాఫిక్ సీఐ టి.శ్రీనుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

'టెన్త్ సైన్స్ పరీక్ష వేర్వేరుగా నిర్వహించాలి'

అనకాపల్లిటౌన్ : పదో తరగతి విద్యార్థులకు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం(ఎన్ఎస్) పరీక్షలను వేర్వేరుగా నిర్వహించాలని జిల్లా సైన్స్ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రైవేట్ భవనంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు జిల్లా సైన్స్ ఉపాధ్యాయులు ఎంఎస్‌వీఎస్‌పీ వర్మ, కె.కాశిదాసు వినతిపత్రం అందించారు.